మతి

ఆనాడాదివారం మేటనీకి బయల్దేరిన లక్ష్మి రాధ, సీత ఏడుపు మొహాలతో తిరిగివచ్చారు. అల్లిబిల్లిగా అల్లుకుపోయిన లతలాగ లెఖ్ఖలేనన్ని వంకరలు తిరిగి, భూమధ్యరేఖకన్నా పొడుగాటి క్యూవలన లాభంలేక పోయింది. ఆఖరుకు ఏతరగతి టిక్కెట్టయినా ఎంతకైనా సరే కొనేయడానికి తెగించారు.

దొరికి చావందే! తలుపు తాళంతీసి ముగ్గురూ మూడు మంచాలమీద చేరబడిపోయారు. టైము పట్టైంది.

ఉన్నట్టుండి........ 'ఒరే నేసలాగ మా అక్కదగ్గరకెళ్ళొస్తాను అరగంటలో. ఉండండిక్కడే' అనేసి సీతశాస్త్రి బయటకు నడచింది.

'రాధా! ఇంతకన్నా అన్యాయంలేదు. మూడు రోజులనుండి చూస్తున్నాను. ఎక్కడికెళ్ళినా శనిగాడు హాజరు. నిన్నచూడు అనవసరంగా ఫిజిక్సు లెక్చరరుచేత పడచివాట్లు తినేశాను. ఛీ....ఛీ..'

'ఐనా మరీ అంత మరుపేమిటి లక్ష్మి? ఇన్నాళ్ళ గోలపెట్టి మొన్నంత సివియరు వార్నింగిచ్చారు ఇంతాచేసి ఇంట్లో మర్చిపోతే.......'

'మర్చిపోయాను మొర్రో! అని చచ్చి గీపెట్టినా నమ్మి చావకపోతే ఎలా అఘోరించడం? వెధవది ఛీ...ఈ వేళ చూడు! వేలు లక్షలమందికి టిక్కెట్లు దొరికాయి. మనకిమాత్రం దొరికి చావలేదు. ఛీ.....ఛీ....." అని కోపంగా ఝాడించిన చేతినుండి అప్పుడే విప్పిన జోళ్ళు గది మూలలకు గిరవాటు పడ్డాయి.

సో. నుట్టించి ఇంత టీ చేసుకు తాగారు. ఐనా చిరాకు తగ్గలేదు.

'లక్ష్మి, నిజంగా ఈవేళ సాయంకాలంమైనా మేటనీకి వెళ్ళే యోగ్యత లేదా అని!'

'యోగ్యత! ఇప్పుడెళ్ళి నడిపోను! మొట్టమొదటి టిక్కెట్లు నువదేసనుకో.'

'నీకు కొంచెమైనా బుర్రలేదు సుమీ! ఆడాళ్లకు బుర్రలుండవు అన్నది సామెత! ఎద్వాన్సు బుకింగ్లె పోయిందిగదా!'

'ఆ సామెత నాకుగాదు. ఇటునుండటు. నీకు

'ఫల్గుణ'

వర్తిస్తుంది. పన్నెండు గంటలకెళ్ళి క్యూలో నాస్తే దొరక్కెక్కడికెళ్తుంది?'

ఇంతలో సీతకూడ రాగానే ముగ్గురు అదే విషయం తీవ్రంగా చర్చించేశారు. ఆఖరుకు ఖచ్చితంగా నిర్ణయించేసుకున్నారు. అటు సూర్యుడిటు పొడిచినా మధ్యాహ్నం మేటనీ తప్పడానికి వీలులేదు. భోజనాలయాయి. టైము పన్నెండు దైంది. ముగ్గురు బయల్దేరుతున్నారు.

'ఖైం........'మని సీతవేసిన కేకకు లక్ష్మి రాధా హడలిపోయారు. నరుగెత్తారు. ఏక హడావుడిగా సీత పుస్తకాలన్నీ కలగాపులం చేయడం కన్పించింది. చివరకు తేలిన విషయమేమిటంటే నూరు రూపాయిల కాగితం కిమన్నాస్తి! కన్పించలేదు.

'అసలెక్కడ పెట్టావు?'

'ఇక్కడే పుస్తకంలో పెట్టేను. 'బేరల్లో శవం' అన్న డిటెక్టివ్ పుస్తకంలో పెట్టాను. మీరు గాని చూశారా?'

'నిన్న లక్ష్మి తీసుకెళ్తున్నట్లుంది కాలేజికి'

'చఛ........నాకు తెలీదే నేను తీసుకెళ్ళలేదు'

లక్ష్మి గాభరా వర్ణనాతీతం. ఆ ముఖం చూచి తీరవలసిందే నిజంగా.

'నీ తలకాయ కాదు! నిన్న ఘరుడవరు లైబరులో

నువ్వు చదువుతున్నాను నేను చూశాను. సరిగా జ్ఞాపకం తెచ్చుకో. నీ వెధవ మతిమరుపు నువ్వూను' అని రాధ అనేసరికి లక్ష్మికి ఉన్న మతి కాస్తా పోయింది. అయోమయం ! గాభరా ! హడావుడి !

కాస్త తేరుకుని 'యస్ ఎగ్జాక్ట్లీ...అవున్నిజంగా ! అవును...... అది శేఖరుగారు పట్టుకెళ్లారు..... ఏమండీ చదివిచ్చేస్తానంటే అలాగేననవలసి వచ్చింది మరి'.

సీత శరీరం శీతలం క్రమ్మి నిర్జీవంగా చేరబడగానే రాధ లక్ష్మి గాభరా ఎత్తిపోయారు.

'ఏడవలేక పోయావు. నడు అతనింటికి వెళ్దాం. సీతా ఉండు క్షణంలో వస్తాం. ఇద్దరమూను.'

రాధా లక్ష్మి శేఖరు ఇంటిదగ్గర రిక్షా దిగారు.

'శేఖరుగారూ......శేఖరుగారూ....' అని ఆత్రుతగా పిల్చారు. అతని తమ్ముడు బయటకు వచ్చాడు. 'అన్నయ్య ఇంట్లోలేడు చంద్రంగారింటికికెళ్లాడు.' అన్నాడు.

'లక్ష్మి కొంప మునిగింది. ఇపుడెలాగ? ఏం చేయడం?'

'అదే తోచడంలేదు......గాని రాధా ఒకపనిచేస్తే? ఆ పుస్తకం ఇచ్చేయమని ఈ అబ్బాయి నడుగుదాం. ఏమంటావు?'

'లక్ష్మి ఉండుండి నీ బుర్ర బ్రహ్మాండంగా పనిచేస్తుంటుంది సుమీ.....! చూడు బాబు మీ అన్నయ్య పుస్తకాల్లో.....'

'బీరువా తాళం వేసుకుని వెళ్లిపోతాడండీ అన్నయ్య. లాభంలేదు.'

'ఐతే రాధా ఇపుడేం చేద్దామంటావు?'

'ఒకర్నొకరు పట్టుకుని ఏడుద్దాం మొర్రో మంటూ ! నడు చంద్రంగారింటికెళ్దాం. అంతకన్నా చేసేదేముంది గనక !'

'నీకు తెలుసునా ఇల్లు ! అతనిల్లు నాకు తెలీదు'

'నీకింకో ఉద్దైనా తెలిసి చచ్చిందేమిటి?'

ఇద్దరూ అదే రిక్షా ఎక్కారు. రిక్షా గాలిలో పోతుంది.

'అవును నువ్వు తీసుకెళ్లావే అనుకో ! అతని కెందుకివ్వాలి?'

'అదికాదు రాధా ! అసలేం జరిగిందంటే.....! నేను లైబ్రరీకెళ్లి అక్కడ మర్చిపోయాను. వచ్చేస్తుంటే శేఖరే పిల్చి, ఏవండీ మరీ పుస్తకం మర్చిపోయారు. నేను చదివి మీకిచ్చేస్తానండీ అన్నారు. కారే అనక ఏంచేయడం చెప్పు !'

'ఉద్ధరించావు..........'

రిక్షా ఆగగానే పిల్చి అడిగారు. శేఖరం చంద్రం కలిసి భాను ఇంటికి పది నిమిషాల క్రిందట వెళ్లారని చెప్పారు.

ఇద్దరకు ఒక విధమైన ఆయాసం అంకురించింది. గాని చేయగల్గిందిలేదు. తప్పదు. అదే రిక్షా మళ్లీ బయల్దేరింది.

'భానుమూర్తిగారూ........' అని పిల్చారు.

'ఏం........? ఏమిటీ కొంప మునిగిపోయింది?' అని అతని నాన్నగారు తీవ్రంగా తలుపు తీశారు. ఏరినిచూసి 'మీరూ ఉన్నారూ? అంతేనా ఇంకెవరైనా ఉన్నారా? మీకు చదువులేమిటి వా్రశార్థం! పెద్ద గాడిదల్లాగ ఒకరి వెనకొతల ఇంకొకరు తిరగడంలో సరి. పొండి.........'

స్థాణువుల్లాగ స్తంభించిపోయారిద్దరూ. ఒకరి నోట మాటరాలేదు. అతను దభాలున వేసేయడాయనికి సిద్ధంగా ఉన్నారు.

'అది కాదండి ప్లీజ్ అతనితో శేఖరంగారు....'

'శేఖరం శంకరగిరి మన్యాల్లో అఘోరించాడు. మీకు సిగ్గు అంటూ తగలడ్డాయా? ఈపాటి దానికి చదువులు వెలగబెడదామని ఏడవడం ఎందుకు ఒకడి తర్వాత ఒకడు. వాడి తర్వాత ఇంకొకడు. ఆఖరుకు వీళ్లుకూడా తయారు. ఇదంతా సబ్జెక్టులు, పార్టులు కదూ !'

'వాళ్లెక్కడికెళ్లారండీ........?' మాట రాధ గొంతులోనే పూడుకు పోయింది.

'ఎక్కడికెళ్తారు ! పెద్ద ఏమీ ఎరుగని నంగనాచుల్లాగడుగుతున్నారు. మీరందరూ కలిసి వేసుకున్న ప్రోగామేకదూ ! మీకు చదువులెందుకు? చదువంటే ఇంటరెస్టు మీలో ఒక్కరికుందీ? అబ్బే...... ! ఎంతసేపు సినీమాలే ! ఆ హాల్లో కాలేజీలు, లేబరేటరీలూను. అసలు మీరందరిలాగే అఘోరిస్తున్నారంటే ఆ తప్పు మీది కాదు. నిజానికి తప్పు మాది. మీ క్రింద అనవసరంగా డబ్బు తగలేస్తున్నాం. మీరేమో సినిమాలకెళ్తారు. ఏమిటంటే కొంప మునిగిపోయింది? వెధవ సినిమా చూసేయ్యాలి. ఏమీటూ వల్లకాడు హాలు ! అలంకారట.........'

అంతే !......ఇద్దరూ రిక్షాలో కెగిరిపోయారు. ఇదంతా చూస్తున్న రిక్షావాడు రాకెట్టయిపోయాడు. బిగబట్టిన వూపిరి వదలడం మర్చిపోయారు ముగ్గురికి ముగ్గురూ.

'రాధా నా గుండె దడ ఇంకా తగ్గలేదు'.

'లక్ష్మి అవంతే ! అసలటువంటి వాళ్లతో మనలాంటివాళ్లు మాట్లాడ్డం బుద్ధితక్కువ. ఏంచేస్తాం? ఎలకపిల్లల్లాగ దొరికిపోయాం.'

'ఇంతకూ అడిగినదానికి సమాధానం చెప్పారే గాదు.'

'చెప్పరు. అడిగింది వదిలేసి, అక్కర్లేనివి లక్ష శతకాలు చదువుతారు. అందుకే మనకు కావలసింది దొర్కుతుందా అని చూస్తున్నాను. సినిమాకనగానే హమ్మయ్య బిసుకున్నాను. గాని ఏ హాలో పేరు చెప్పన్దే ఒకంతట !' ఇద్దరూ నవ్వేశారు.

'ఒకటా రెండా ! ఎన్ని హాల్లు వెతుకుతాం?'

'అలంకారన్న ముక్కరాగానే ఎగిరిపోయాం. కాని లక్ష్మి! వస్తామనికూడా అనలేదు.'

'ఇంకేమంటాం ! హాముఖం ! ఇదుగో అలంకారు.'

రిక్షావాడి మండమని వెతికారు. రష్ మహా దొమ్మీగా ఉంది. ఎక్కడా కనిపించలేదు. హాలు లోపలకూడా చూచారు. లేరు. అంతా గాలించేస్తున్నారు.

కేంటీను దగ్గర దూరంగా చంద్రం కనిపించాడు. హమ్మయ్య ! ప్రాణాలు లేచివచ్చాయి. గబగబా వెళ్లారు. చంద్రం భాను కాఫీ త్రాగుతున్నారు.

'ఏమండీ శేఖరుగారెక్కడో?'

'ఆదేం శేఖరండీ వెధవ......నవ్వారో ఏడవారో తెలియదు!'

'ఏమండీ ఏంవ్వైంది? ఆవలితనేరి?, రాధ గొంతులో ఆత్రుత ధ్వనిస్తుంది. కాని భాను గమనించే స్థితిలో లేడు.

'ఏడీ?..... అసలీ ప్రోగ్రాం వేసింది వాడూ టిక్కెట్టు ఎవ్వాన్ను వాడే తీసుకున్నాడు. మా అందరం అందర్నీ లెగ్గొట్టాడు. ఇక్కడికి వచ్చాం. తిన్నగా హాలులోనికి పోయి కూర్చున్నా బాగుండిపోను. కాకరకాయలాగ ఈ చంద్రంగాడొకడు. కాఫీ గత్రపాణి ! కాఫీ త్రాగుదాం అన్నాడు, పానకంలో పుడకలాగ ! వచ్చామండీ ఇక్కడికి. అంతే ! ఫినిష్ !'

'అంటే......?' రాధకు తలాతోకా అందలేదు.

'అంటే ! అంటే ఇంకేముంది ! ఒక రిక్షా ఇలా వెళ్తుంది. అందులో వాళ్లెవరో సామానులతో బండికో బస్సుకో పోతున్నారు. చూశారండీ.'

'వాళ్లతో వెళ్లిపోయారా........?' చటుక్కున రాధ అనేసరికి ఫక్కాలున నవ్వారంతా.

'అబ్బే !......వాళ్లతో వెళ్లిపోయినా కొంత బాగుండిపోను. గాని, వాళ్లెవరో !..... కాని విశేషం ఏమిటంటే, పెళ్లి పిన్నిని ఒకావిడని బండెక్కించి వాళ్ల చిన్నాన్న వైరిచ్చాడట స్టేషనుకు తప్పకుండా వచ్చి తీసుకవెళ్లమని. ఆ వైరు ప్రొద్దున్నే అందింది. మనవాడికి జ్ఞాపకమే లేదు. ఆ రిక్షా సామాను చూసేసరికి ఇంకేముంది.! మనవాడికి బ్రహ్మజ్ఞానం కలిగింది. స్టేషనుకు పరిగెత్తాడిప్పుడే. బస్సులో...... టిక్కెట్టు అనవసరంగా పోతుందండీ. కాని మీరిద్దరు.....'

'లాభం లేదండీ. శేఖరుగారి నర్జంటుగా కలుసుకోవాలి. వస్తామండీ. రా లక్ష్మీ.....' రిక్షా స్టేషను వైపు బయల్దేరింది.

'రాధా ! తండ్రికి సరిగా సరిపోయే కొడుకు.''

'ఈ నానుడికి కోపంకూడా తయారైతే ఆ ఖిల బ్రహ్మాండం' రిక్షావాడితో సహా నవ్వేశారు.

'గాని రాధా టిక్కెట్టు ఒక్కటేవుంది. ఐనా ఒకటిలే. ఈ పరిస్థితిలో మూడు టిక్కెట్లున్నా వెళ్లలేం. మొత్తంమీద సినిమా లేనట్టే.'

''సరిపోయింది ఊరంతా కరిపోయిందనిడిస్తే నటా !.......'

స్టేషనులో అంతా వెతికారు. ప్లాటుఫారం వెయిటింగు రూము, బుక్‌స్టాలు, టీ స్టాలు, ఎక్కడా కనిపించలేదు. భాను తండ్రిగారి కేకలకు వదిలిపోయిన నీరసం మళ్లీ తలెత్తుతుంది. ఐనా తప్పదు ! అన్న క్లాజు ఎప్పుడూ ఉండనే ఉంది.

ఆఖరుకు ప్లాటుఫారం చివర సిమ్మెంటు బెంచీ మీద శేఖరు శాస్త్రి కనబడింది. ప్రాణాలు కుదుటపడ్డాయి. హమ్మయ్య ! మనిషి దొరికాడు.

'హల్లో శేఖరుగారూ నమస్తే. నిన్న మీకిచ్చిన పేపాలో శవం అన్న పుస్తకం......' అని లక్ష్మి గాభరాగా అంటుండగానే.

'మీరిచ్చింది టేబల్‌లో శవం అండీ !' ముగ్గురూ నవ్వేశారు.

మతి

'ఆ పుస్తకం కాస్త అర్జెంటుగా కావాలి. దానిలో ఒక ముఖ్యమైన విషయం ఉంది.'

'ఆహా.....నేను చదివేశాను. ఇందాక ఇచ్చేద్దామనే అనుకున్నాను. సరేలెండి సాయంకాలం మీ రూముకే తెచ్చిచ్చేస్తాను. ఐయామ్ వెరీసారీ'

'అది కాదండీ శ్రమనుకోకుండా మీరిప్పుడొకసారి...'

'అంతర్జెంటా ! పోతే ఎలాగ? బండి ఒకరగంటలో వచ్చేస్తుంది. నేను రావడంకాదు ముఖ్యం. అసలిచ్చేద్దామనుకుంటుంటే భాస్కరం తీసుకున్నాడు'.

ఇద్దరికిద్దరూ నీరు కారిపోయారు.

'ఒక పని చేయండి ప్లీజ్. మరోకలా భావించ భాస్కరం ఇపుడింట్లోనే ఉంటాడు. వాడి నడ గండిచ్చేస్తాడు.'

'సరే వెళ్దామండీ' అనేసి బయల్దేరారు. అతని ముఖ కవళికలలో విశేషమేమీ కన్పించలేదు. గాని విషయం ఫలానా అని చెప్పటానికి వీలులేదు. అతనుకూడా ఏమీ అనలేదు. సరేనని ధైర్యం వహించాక తప్పలేదు. భాస్కరం మళువుగానే దొరికాడు. పుస్తకం ఇచ్చేశాడు. రాధ అబ్జర్వేషనుకు అతని ముఖంలో గూడ ఏమీ కన్పించలేదు.

రిక్షావాడికి మొత్తంగా డబ్బులిచ్చి పంపించేశారు.

పుస్తకాన్ని చూడగానే సీతకు ప్రాణం లేచి వచ్చింది. హమ్మయ్య......! అనడం, లక్ష్మి కుర్చీలో చేరబడడం ఒక్కసారే జరిగాయి. రాధచేతిలో పుస్తకాన్ని లాక్కుని అట్ట విప్పేసి చూడడానికి సీతకు క్షణం పట్టలేదు.

గాని నూరు రూపాయలు కాయితం లేదు.

'రాధా కొంప మునిగిపోయింది. టర్మ్ ఫీజుకని నాన్నగారు ఇన్సూరు చేసినదా డబ్బు. ఇది చదువుతూ ఇందులో పెట్టేశాను.'

'నిన్న పెట్టి ఈ వేళ జ్ఞాపకం తెచ్చుకుంటావా. డబ్బు దగ్గర అంత అజాగ్రత్తేమి?'

'అజాగ్రత్తకాదు రాధా. ఈ డిటెక్టివ్ మత్తు అలాంటిది. నాకు తెల్సు.'

'అందుకే జాగ్రత్తగా అట్టలో పెట్టేను దేనికైనా మంచిదని.'

'ఐనా శేఖరం, భాస్కరం తీశారనుకోను.'

'బయటకు కనిపించదుకదూ ! ఇప్పుడెలాగ?'

'ఏమి సీతా ఎక్కడ పెట్టేవు?' లక్ష్మి కంఠం విన్పించింది.

'ఇదే లక్ష్మి ఈ అట్టలో పెట్టేను.'

ఆ అట్ట తీసేయగానే ఒక పెద్ద ఆయిలు పేరలు. అందులో రంగు రంగులతో శవం. ఆ ప్రక్కన ఒక ఆడమనిషి మొహం, పెద్ద కేక పెట్టినట్టుగా ఉంది. అదంతా చూడగానే లక్ష్మికి జ్ఞాపకం వచ్చింది.

'కరెక్టు........బాగా జ్ఞాపకం వచ్చింది. ఐతే సీతా డబ్బు అజాగ్రత్తగానా పెట్టుకుంటావ్? తిరిగి తిరిగి నా అవస్థాపడి చచ్చాం అనవసరంగా. ముందుగా చెప్పుకోవు ఆ విషయం? అది నా జేబులోనే ఉంది.' అని షర్టు జేబులో పోస్టుకార్డు మధ్యగా మడచిన కాగితం తీశాడు లక్ష్మీపతి.

'హమ్మయ్య !....... లేదనగానే గుండె ఆగిపోయింది' అన్నాడు సీతారామశాస్త్రి.

'వెధవా నీకు మతీ సుతీ బుద్ధీ : జ్ఞానం, ఏమైనా ఏడ్చి చచ్చి అఘోరించి తగలడ్డాయిరా? రాస్కెల్ ! మట్టిబుర్ర వెధవా !' అన్నాడు రాధా మాధవశర్మ.

'అవును లక్ష్మి అదేమి? జేబులో ఉంచుకుని పూరంతా తిరిగి వచ్చావు అనవసరంగా ! అందరికీ గాభరా ఎత్తించేశావు.' అన్నాడు సీత.

'వెధవ వెధవ వెధవన్నర వెధవ, జిడ్డు వెధవ. వీడి మతి మరుపుకు అందరికీ మతులు పోగొట్టేస్తు, చవట వెధవ !' అన్నాడు రాధ.

'అదికాదురా బాబూ ! చెప్పేది వినండి. నేనీ పుస్తకం లైబ్రరీలో చదువుతున్నాను. ఇంట్రెస్టుగా ఉంది. కవరుమీద బొమ్మ చూద్దామనిపించి అట్టతీశాను. ఇదీ కాగితం. నిజంగా సీతమీద బ్రహ్మాండమైన కోపం వచ్చేసింది. చెడామడా చివాట్లు పెట్టేద్దామనిపించింది.''.

'అప్పటికే శెక్సపియరు చేత బాగా తినేసి ఉన్నాడు మరి'

'అదే అనుకో ! జేబులోనైతే జాగ్రత్త చేశాను. కాని పూర్తిగా చదివేసరికి బుర్ర వేడెక్కిపోయింది. అదీ జరిగిన సంగతి.'

'ఏడిశావ్ ! ఇకనైనా సరిగానుండు.'

ముగ్గురూ ఒక విధమైన బరువు తీరినట్టు వూపిరి పీల్చుకున్నారు. ★